సాక్షి
రాజన్న సిరిసిల్ల

సోమవారం : 29 . మే. 2023



గోశాలకు కోడెలు

వేములవాడరూరల్: రాజన్న 20 కోడెలను హన్మకొండ జిల్లా ఐనవోలు మండలం ఒంటి మామిడిపల్లికి చెందిన మల్లికార్జున వెల్ఫేర్ సొసైటీకి అందజేశారు.



పెట్టుబడికి పైసలు లేక పరేషాన్

చందుర్తి(వేములవాడ): ధాన్యం డబ్బులు రాక.. పెట్టుబడికి పైసలు లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
42.0/28.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశం అతి స్వల్పంగా ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

రాజన్న ఆలయంలో సొమ్మసిల్లి పడిపోయిన బాలుడు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు ముఖేశ్

వేములవాడ: జగిత్యాల జిల్లా మోతెకు చెందిన డి.ముఖేశ్(15) రాజన్న సన్నిధిలో ఆదివారం సొమ్మసిల్లి పడిపోయాడు. రమేశ్–సృజన దంపతులు తమ కుటుంబ సభ్యులతో కలసి వేములవాడ రాజన్న దర్శనానికి వచ్చారు. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో తన కుమారుడు ముఖేశ్ సొమ్మసిల్లి పడిపోయాడని, సహాయం అందించాలని వేడుకున్నా ఎవరూ స్పందించలేదన్నారు. ఆటోలో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించామని రమేశ్ తెలిపారు. కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్న రాజన్న ఆలయంలో కనీస సౌకర్యాలు లేకుండా పోయాయని వాపోయారు.

రాజ్యాధికారం సాధించాలి



మాట్లాడుతున్న నాయకులు

సిరిసిల్లఅర్బన్: బహుజనులు రాజ్యాధికారం సాధించే దిశగా ఐక్యమవ్వాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి బట్టు రాంచంద్రం పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని బీఎస్పీ కార్యాలయంలో ఆదివారం పార్టీ జిల్లా అధ్యక్షుడు స్వామిగౌడ్ ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జి రామచంద్రం మాట్లాడుతూ ఎందరో అమరుల త్యాగాలతో ఏర్పడిన తెలంగాణ దోపిడిదారులకు నిలయమైందన్నారు. బీఎస్పీ పట్టణాధ్యక్షుడిగా తడుక భాను, పట్టణ ఇన్‌చార్జిగా అరుకల రమేశ్ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు మహేందర్, ప్రచార కార్యదర్శి యారపు బాబు, సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి లింగంపల్లి మధుకర్, నాయకులు అన్నల్‌దాస్ భాను, నరేందర్, వేణుగోపాల్, రాజశేఖర్ ఉన్నారు.

ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకోవాలి



ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని అనంతపల్లి గ్రామ రజక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఐలమ్మ పెత్తందారి వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం చేశారని, ఆమెను ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వంగపల్లి సత్యనారాయణ రెడ్డి, ఎంపీటీసీ కంకణాల వనజ, డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, ఉపసర్పంచ్ పర్శ మల్లేశం, మాజీ ఎంపీటీసీ వంగపల్లి రాజిరెడ్డి, పురుషోత్తం రెడ్డి, రజక సంఘం నాయకులు అలువాల భూమయ్య, అలువాల ధర్మయ్య, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



అవార్డు అందుకుంటున్న విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): పదో తరగతి పరీక్షల్లో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు కరీంనగర్‌కు చెందిన వెంకట్ ఫౌండేషన్ ఆదివారం ప్రతిభా పురస్కారాలు, రూ.3 వేల నగదు ప్రోత్సాహకం అందించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన నేవూరి హారిక, మహ్మద్ రెహాన్, రాచర్ల గొల్లపల్లికి చెందిన గుర్రాల స్ఫూర్తి ఈ పురస్కారాలు అందుకున్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కడవేర్గు సుప్రియకు వెంకట్ ఫౌండేషన్ ప్రతిభా పురస్కారం అందించారు. అలాగే పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్‌కు సన్మానం చేశారు.

బహుపరాక్ !

- సిరిసిల్లలో ట్రాఫిక్ నిబంధనలు కఠినం
- సీసీ కెమెరాలతో ఉల్లం'ఘను'ల లెక్కింపు
- అతివేగంగా వెళ్తే ఫైన్ కట్టాల్సిందే..
- అందుబాటులోకి ట్రాఫిక్ సిగ్నల్స్
- తొలగిన పదిహేను సెకన్ల పరేషాన్



స్పీడ్‌గన్‌లో వేగాన్ని లెక్కిస్తున్న వేములవాడ ట్రాఫిక్ ఎస్సై దిలీప్



కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన 360 డిగ్రీల సీసీ కెమెరాలు

> రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఇక నుంచి ఇష్టారీతిన వాహనాలు నడిపే వారిపై నిఘా తీవ్రం కానుంది. నిబంధనలు ఉల్లంఘించే వారిపై సీసీ కెమెరాలతో గుర్తించనున్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ కూడా అమలుకావడంతో వాహనాల వేగానికి కళ్లెం వేసినట్లు అయ్యింది. ప్రజల భద్రతే లక్ష్యంగా ట్రాఫిక్ రూల్స్ అమలు చేస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు.

సిరిసిల్లక్రైం: రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలో ట్రాఫిక్‌ను నియంత్రించే పనిలో భాగంగా పోలీసులు నిబంధనలు కఠినంగా అమలు చేస్తున్నారు. సీసీ కెమెరాలు, స్పీడ్‌గన్, ట్రాఫిక్‌సిగ్నల్స్‌తో వాహనాల రద్దీని నియంత్రిస్తున్నారు. అంతేకాకుండా అధునాతన ఇంటర్‌సెప్టార్ వాహనంతో నిఘా పటిష్టం చేశారు. ట్రాఫిక్ సిగ్నల్స్ అమలులో భాగంగా తొలి రోజుల్లో హెచ్చుతగ్గులు ఉన్న దానిపై 'సాక్షి' కథనంతో అధికారులు స్పందించి 25 సెకండ్ల కాలపరిమితి విధించారు.

స్పీడ్‌గన్, ట్రాఫిక్ సిగ్నల్స్

సిరిసిల్ల జిల్లాగా ఏర్పడిన కొద్ది నెలల వరకు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై జరిమానాలు విధించేవారు. పెరిగిన వాహనాల రద్దీ, సాంకేతిక పరిజ్ఞానంతో ఇక వాహనాల చట్టం ఉల్లంఘనుల చర్యలను కెమెరాల్లో నిక్షిప్తం చేసి జరిమానాలు విధిస్తున్నారు. స్పీడ్‌గన్ వాహనాల స్పీడ్‌ను లెక్కించి నిర్ణీత వేగానికి మించి వెళ్తే జరిమానాలు విధిస్తున్నారు.

కొరవడిన సూచిక,స్పీడ్ లిమిట్ బోర్డులు

- జిల్లాలోని ప్రధాన రహదారుల వెంట వేగాన్ని సూచించే బోర్డులు కనిపించడం లేదు. చౌరస్తాలన్నీ ప్రమాదాలకు నెలవుగా మారుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి.
- పోలీసు అధికారులు పలు కూడళ్లలో వాహన స్టాపర్లను హద్దులుగా పెట్టి సంవత్సరాలు కావస్తున్న నేటికి పూర్తిస్థాయి సదుపాయాలు కల్పించలేదు.
- కలెక్టరేట్ ఎదుట ప్రమాదకర జంక్షన్ ఉంది. వేములవాడ, కామారెడ్డి, హైదరాబాద్, కరీంనగర్ ప్రధాన రహదారి నుంచి ఏ వాహనాలు ఎటూ వెళ్లాలని సూచించే బోర్డులు లేవు.
- చంద్రంపేట క్రాసింగ్ వద్ద స్పీడ్ బ్రేకర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇక్కడ చాలా ప్రమాదాలు జరిగాయి.
- సిరిసిల్ల కొత్తచెరువు నుంచి కార్గిల్‌లేక్ రోడ్డుకు ఇరువైపులా నిర్మించిన ఫుట్‌పాత్‌లను వ్యాపారులు ఆక్రమించారు.
- పాతబస్టాండ్ ఏరియాలో పండ్ల వ్యాపారులు ట్రాఫిక్ సిగ్నల్స్ నేతన్న ప్రాంతాన్ని ఇరుకుగా మార్చాయి. దీనిపై మున్సిపల్ అధికారులు, పోలీసు అధికారులు సమన్వయంతో తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

జిల్లాలోని వాహనాలు ఇలా..

ద్విచక్రవాహనాలు	:92,132
మోటార్ క్యాబ్స్	:876
ట్రాక్టర్స్	:9,943
గూడ్స్ క్యారియర్స్	:4,566
ఆటోలు	:4,231
అంబులెన్స్‌లు	:38

ఆన్‌లైన్‌లోనే జరిమానాలు



నిబంధనలు అమలు చేసి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూసేందుకు కొత్త విధానాలను అవలంబిస్తున్నాం. ఇప్పటికే పాతబస్టాండ్ ఏరియాలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసి వాహనాల రద్దీని నియంత్రించాం. వాహనాలను నిలిపి, వెళ్లేందుకు నిర్ణయించిన సమయాన్ని వాహనదారుల కోరిక మేరకు సడలింపు చేశాం. అనుమతి లేని ఏరియాల్లో వాహనాలు నిలిపితే జరిమానాలు విధిస్తాం. వాహనాలు నడిపేవాళ్లు, ప్రజలు సురక్షితంగా గమ్యం చేరాలనేది మా విధి నిర్వహణ. – రాజు, ట్రాఫిక్ ఎస్సై, సిరిసిల్ల

సిబ్బంది ఆరోగ్యానికి ప్రాధాన్యత



వైద్యశిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న ఎస్పీ అఖిల్ మహాజన్

- ఎస్పీ అఖిల్ మహాజన్
- పోలీసులకు మెగా హెల్త్‌క్యాంపు

సిరిసిల్లక్రైం: నిరంతరం విధుల్లో బిజీగా ఉండే పోలీసు అధికారులు, సిబ్బంది ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నామని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. సిరిసిల్లలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో తారకరామ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మెగా హెల్త్‌క్యాంపులో పలు వైద్యపరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు నడక, వ్యాయామం, యోగ దినచర్యలో భాగం కావాలన్నారు. నలభై ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరు మూడు నెలలకోసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. తారకరామ ఆస్పత్రి యాజమాన్యానికి ఎస్పీ అఖిల్ మహాజన్ కృతజ్ఞతలు తెలిపారు. డీఎస్పీ నాగేంద్రచారి, యూరాలజీ వైద్యులు మహేశ్, జనరల్‌సర్జన్ నరేశ్‌కుమార్, రీనా శర్మిలీ, సీఐ అనిల్‌కుమార్, ఉపేందర్, మొగిలి, ఆర్ఐ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు పరిష్కరించాలి

- డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్



మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

కోనరావుపేట: గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు పరిష్కరించాలని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని బావుసాయిపేటలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో లారీలు రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఆయా గ్రామాల్లోని కేంద్రాల్లో కొనుగోళ్లు నిలిచిపోతున్నాయన్నారు. బస్తాకు రెండున్నర కిలోలు అధికంగా తూకం వేస్తుండటంతో రైతులు నష్టపోతున్నారన్నారు. రానున్న వారం పది రోజుల్లో వర్షాలు పడే అవకాశం ఉండటంతో అధికారులు కొనుగోళ్లను వేగవంతం చేసి పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా, నాయకులు బైరగోని నందుగౌడ్, శ్రీనివాస్ గౌడ్, తాళ్లపెల్లి, ప్రభాకర్, తదితరులున్నారు.







మండుటెండలోనూ రాజన్న దర్శనానికి..

వేములవాడ: ఎండల తీవ్రత పెరిగిన రాజన్న దర్శనానికి భారీగా భక్తులు తరలివస్తున్నారు. ఆదివారం 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. తలనీలాలు సమర్పించిన భక్తులు నిలువెత్తు బెల్లం, కోడె మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం బద్దిపోచమ్మకు బోనం మొక్కులు సమర్పించారు. ఏఈవో శ్రీనివాస్, పర్యవేక్షకులు తిరుపతిరావు, అల్లి శంకర్, శ్రీరాములు పరిశీలించారు.





'సన్'డే

సిరిసిల్ల: జిల్లాలో ఆదివారం ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలకు చేరుకున్నాయి. మే 25వ తేదీన రోహిణీ కార్తె ప్రవేశించగా.. రోళ్లు పగిలే ఎండలు కొడుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు భారీగా పెరిగిపోవడంతో రోడ్లపై జనం కనిపించలేదు. వడగాలులు ఎక్కువయ్యాయి. మధ్యాహ్నం పూట వేడిగాలులతో జనం ఉక్కిరిబిక్కిరి అయ్యారు.

కేంద్రాల్లోనే ధాన్యం

- లారీలు రాక మిల్లులకు తరలని వైనం
- నిలిచిపోయిన కొనుగోళ్లు
- నెల రోజులుగా కేంద్రాల్లోనే నిరీక్షణ
- పట్టించుకోని అధికారులు



❐ ధాన్యం రాశి వద్ద దిగాలుగా కూర్చున్న యువ రైతు రుద్రంగి మండల కేంద్రానికి చెందిన ఎకిలిపురం రమేశ్. తనకున్న రెండు ఎకరాలతో పాటు మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేశాడు. రెండు నెలల క్రితం రెండు ఎకరాల వరి కోత కోసి మార్కెట్ యార్డులోని కొనుగోలు కేంద్రంలో పోశాడు. పది రోజుల క్రితం కౌలుకు తీసుకున్న భూమిలోని పంట సైతం చేతికి రాగా.. కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చాడు. ఇప్పటికీ ధాన్యం తూకం వేయకపోవడంతో కుప్ప వద్దనే రాత్రి, పగలు కాపలా ఉంటున్నాడు.



❐ ధాన్యం బస్తాల వద్ద నిలబడ్డ రైతు రుద్రంగికి చెందిన లావుడ్య రవి. తూకం వేసిన ధాన్యం బస్తాలను మిల్లుకు తరలించకపోవడంతో వారం రోజులుగా నిత్యం వచ్చి ఇక్కడే కాపలా ఉంటున్నాడు.



❐ ధాన్యం తూకం వేస్తున్న ఈ రైతు రుద్రంగికి చెందిన లింగంపెల్లి భూమయ్య. నెల రోజుల క్రితం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో పోశాడు. తేమశాతం రావడంతో ఆదివారం తూకం వేస్తున్నా రు. అయితే తనకంటే ముందు తూకం వేసిన ధాన్యం బస్తాల ను తరలించేందుకు లారీలు లేకపోవడంతో ఇప్పటికీ కేంద్రంలోనే ఉంటున్నాయి. తన ధాన్యాన్ని ఎప్పుడు తరలిస్తారోనని ప్రశ్నిస్తున్నాడు.

రుద్రంగి(వేములవాడ): వరిపంట చేతికొచ్చే సమయానికి అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన రైతులకు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం కాక ఎదురుచూపులే దిక్కయ్యాయి. ఒక్కో రైతు ధాన్యాన్ని తీసుకొచ్చి నెల రోజులు దగ్గర పడుతున్నా తూకం వేయడం లేదు. తూకం వేసిన ధాన్యాన్ని తరలించేందుకు లారీలు లేక కేంద్రంలోనే బస్తాలు పేరుకుపోతున్నాయి. రైతుల కష్టాలను పట్టించుకునే వారే కరువయ్యారు.

లారీలు వస్తేనే తూకం

ఇప్పటికే తూకం వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు లారీలు లేక పేరుకుపోతున్నాయి. తూకం వేసిన ధాన్యం బరువు తగ్గి మిల్లర్లు కోత విధిస్తారేమోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కేంద్రం నుంచి బస్తాలు మిల్లులకు వెళ్లిపోతేనే తూకం వేస్తామని కేంద్రాల నిర్వాహకులు పేర్కొంటున్నారు. రోహిణి కార్తె ప్రారంభంకావడంతో సాగు పనులు ప్రారంభించుకోవాలని రైతులు ఎదురుచూస్తున్నారు.

కేంద్రాల్లో 13వేల బస్తాలు

రుద్రంగిలోని కొనుగోలు కేంద్రాల్లోనే 13వేల తూకం వేసిన బస్తాలు ఉన్నట్లు తెలుస్తోంది. 15 రోజులుగా మిల్లర్లు ధాన్యం బస్తాలను అన్‌లోడ్ చేసుకోకపోవడంతోనే కేంద్రాలకు లారీలు రావడం లేదనే విమర్శలు ఉన్నాయి. అధికారులు దృష్టి సారించి మిల్లర్లు ధాన్యాన్ని అన్‌లోడ్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

వారం రోజుల్లో పూర్తి చేస్తాం

వారం రోజులుగా ధాన్యం తరలించేందుకు లారీలు రాక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులతో మాట్లాడినం. ఇప్పుడు వస్తున్నాయి. వారం రోజుల్లో కొనుగోళ్లు పూర్తిచేస్తాం. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూస్తాం.
– జలగం కిషన్‌రావు, సింగిల్‌విండో చైర్మన్

దేశ సమైఖ్యతను చాటాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ
- రాజన్నకు కోడె మొక్కు చెల్లింపు



రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకుంటున్న ప్రతాప రామకృష్ణ

వేములవాడ: దేశ సమైఖ్యతను చాటి చెప్పాల్సిన సమయంలో పార్లమెంట్ ప్రారంభోత్సవానికి ప్రతిపక్షాలు హాజరుకాకపోవడం సరైంది కాదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ పేర్కొన్నారు. ఇక నుంచైనా పార్లమెంట్‌లో జరిగే ప్రతీ అంశం దేశాభివృద్ధికి దోహదపడాలని కోరుతూ రాజన్నకు ఆదివారం కోడెమొక్కు చెల్లించుకున్నారు. ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ స్వాతంత్య్రం సిద్ధించి 75 ఏళ్లు గడుస్తున్నా సమయంలో పార్లమెంట్ ప్రారంభోత్సవాన్ని కూడా రాజకీయం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు గోపు బాలరాజు, ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్, పట్టణాధ్యక్షుడు రేగుల సంతోష్‌బాబు, జిల్లా నాయకులు పిన్నింటి హన్మండ్లు, నందిపేద సుదర్శన్‌యాదవ్, నామాల శేఖర్, గుడిసె మనోజ్, సత్యం పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా ఎన్టీఆర్ శతజయంతి



ఎన్టీఆర్ జయంతి వేడుకల్లో నాయకులు

సిరిసిల్లటౌన్: తెలుగుజాతి కీర్తిని దశదిశలా వ్యాపింపజేసిన దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ శక పురుషుడిగా చరిత్రలో నిలిచారని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలను సిరిసిల్ల పాతబస్టాండు ప్రాంతంలో ఘనంగా నిర్వహించగా..వక్తలు మాట్లాడారు. టీడీపీ నాయకులు తీగల శేఖర్‌గౌడ్, సీనియర్ నాయకులు దుమాల సత్యనారాయణ, ఆడెపు లక్ష్మీనారాయణ, రాజయ్య, భాస్కర్, రాజిరెడ్డి, అయూబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ప్రసాదం అందజేత



భానుప్రకాశ్‌కు రాజన్న ప్రసాదం అందజేస్తున్న రేగుల రాజ్‌కుమార్, తదితరులు

వేములవాడ : బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాశ్, ప్రభారి ప్రదీప్ కుమార్ దుగ్యాలను వేములవాడకు చెందిన రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రేగుల రాజ్‌కుమార్ ఆదివారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో కలిశారు. రాష్ట్ర కార్యవర్గ సమావేశం సందర్భంగా పలు అంశాలపై చర్చించినట్లు రాజ్‌కుమార్ తెలిపారు. అనంతరం రాజన్న ప్రసాదం అందజేశారు.

ధాన్యం రాశులకు వానరాల బెడద



టార్పాలిన్ చింపి ధాన్యం తింటున్న వానరాలు

రుద్రంగి: మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులకు కోతుల బెడద తప్పడం లేదు. ధాన్యం నిల్వలపై కప్పిన టార్పాలిన్ కవర్లను చింపి, ధాన్యాన్ని నేలపాలు చేసి తింటున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. కోతుల బెడద లేకుండా చూడాలని కోరుతున్నారు.

పాట చిత్రీకరణ



షూటింగ్‌లో డ్యాన్స్ చేస్తున్న కళాకారులు

వేములవాడ: వేములవాడ పరిసరాల్లో జానపద పాట షూటింగ్‌ను ఆదివారం నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు తమ నృత్య ప్రదర్శనలిచ్చారు. హీరోయిన్‌గా స్నేహశర్మ, గ్రూప్ డ్యాన్సర్లపై పాటను చిత్రీకరించారు. కెమెరా మెన్ అరుణ్, స్థానిక డ్యాన్సర్ తాళ్లపల్లి నాగరాజు, రాజేశ్, సాండీ పాల్గొన్నారు. స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

బెదిరింపులకు పాల్పడ్డ ఏడుగురిపై కేసు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): బహిరంగంగా బూతులు తిట్టి, దాడి చేసి, చంపుతామని బెదిరించిన ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎల్లారెడ్డిపేట ఎస్సై శేఖర్ ఆదివారం తెలిపారు. గడ్డం నర్సవ్వ ఫిర్యాదుతో గడ్డి నర్సయ్య, గడ్డి లక్ష్మి, గడ్డి నవీన్, గడ్డి వసంత, గడ్డి సంతోష్, బెస్త లక్ష్మి, బెస్త శివకుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పెట్టుబడి పైసలు లేక పరేషాన్

- ధాన్యం విక్రయించి నెల రోజులు
- ఖాతాల్లో జమకాని డబ్బులు
- చేతిలో డబ్బుల్లేక రైతుల దైన్యం
- విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు అప్పులు



దుక్కులు సిద్ధం చేసుకుంటున్న రైతులు

చందుర్తి(వేములవాడ):వానాకాలం సీజన్ దగ్గర పడుతుండడం.. చేతిలో చిల్లిగవ్వ లేకపోవడం.. ధాన్యం అమ్మినా డబ్బులు రాకపోవడంతో అన్నదాతలు పెట్టుబడి కోసం ఆందోళన చెందుతున్నారు. చేసేదేమీ లేక ప్రైవేట్ వ్యాపారుల వద్ద అప్పులు చేస్తున్నారు. యాసంగి పంటలు ఆలస్యంగా చేతికిరావడంతో అమ్మడం కూడా జాప్యమైంది. దీంతో ఇప్పటికీ ధాన్యం డబ్బులు ఖాతాల్లో జమకాలేదు. మరో పది రోజులు గడిస్తే మృగశిర కార్తే ప్రవేశించనుంది. ఈ నేపథ్యంలో ఎరువులు, విత్తనాలు ఎలా కొనేదని రైతులు అయోమయానికి గురవుతున్నారు.

రోహిణిలో వర్షాలు పడితే..

వర్షాధారంగా సాగు చేసే పంటలను రోహిణి కార్తెలో వాన కురిస్తే వేసుకుంటుంటారు. విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేసేందుకు రైతులు చేతిలో డబ్బులు లేక పెట్టుబడి కోసం దిక్కులు చూస్తున్నారు. కొనుగోలు చేసిన ధాన్యం డబ్బులు నాలుగు రోజుల్లో బ్యాంకు ఖాతాల్లో జమచేస్తామన్న అధికారులు ఇరువై రోజులు గడుస్తున్నా పట్టించుకోవడం లేదు. అకాల వర్షాలతో పంటనష్టం ఏర్పడగా.. పరిహారం ఇవ్వకపోయినా కనీసం ధాన్యం డబ్బులైనా ఖాతాల్లో జమచేయాలని రైతులు కోరుతున్నారు.

రుణమాఫీపై స్పష్టతేదీ?

రైతులు బ్యాంకుల్లో తీసుకున్న రూ.లక్ష రుణాన్ని చెల్లించలేక కొత్త రుణాలు పొందలేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల ముందు సీఎం కేసీఆర్ ప్రతి రైతుకు రూ.లక్ష రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. నాలుగేళ్లు గడుస్తున్నా ఆ హామీ నెరవేరలేదు. పాత అప్పును చెల్లించలేక.. కొత్తగా అప్పులు పుట్టక రైతులు ఆందోళన చెందుతున్నారు.

పైసల కోసం చూస్తున్న



వరికోతలు అయిపోయి 20 రోజులకు కాంటా పెట్టారు. ధాన్యాన్ని విక్రయించిన నాలుగు రోజుల్లో ఖాతాల్లో డబ్బులు జమచేస్తామన్నారు. 25 రోజులు గడుస్తున్నా డబ్బులు జమకాలేవు.

– న్యాత దినకర్, బండపల్లి

బ్యాంకులో మిత్తి కడుతున్న



రైతులకు రూ.లక్ష రుణమాఫీ చేస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చిండు. నాలుగేళ్లుగా రుణమాఫీ కాలేదు. బ్యాంకు అధికారులేమో తీసుకున్న అప్పుకు మిత్తి కట్టించుకుంటున్నారు. ఆరేళ్లుగా మిత్తి డబ్బులు రూ.85 వేలకు పైగా కట్టిన. ఇప్పటికైనా ప్రభుత్వం రుణమాఫీ చేయాలి.

– మర్రి మల్లేశం, చందుర్తి

మంత్రి కేటీఆర్ పీఎస్‌కు పరామర్శ



నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

సిరిసిల్లటౌన్: రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కే. తారకరామారావు వ్యక్తిగత కార్యదర్శి శ్రీనివాస్ తల్లి ఇటీవల మృతిచెందగా ఆదివారం నల్గొండలోని స్వగృహంలో జరిగిన దశదిన కర్మ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు. రాములమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): మంత్రి కేటీఆర్ పీఎస్ కనుగుల శ్రీనివాస్‌ను బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. కేటీఆర్ పీఎస్ తల్లి ఇటీవల మృతిచెందగా దశదినకర్మ సందర్భంగా ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మంత్రి పీఏలు కుంభాల మహేందర్ రెడ్డి, ఘన్‌రాజ్, జిల్లెల్ల సర్పంచ్ మాట్ల మధు తదితరులు ఉన్నారు.

ఐదేళ్లుగా ప్రతిమ ఫౌండేషన్ సేవలు

వేములవాడ: ప్రతిమ ఫౌండేషన్ ద్వారా ఐదేళ్లుగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని, ఇందులో భాగంగానే పట్టణంలోని 26వ వార్డులో రూ. 2.50 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించినట్లు వైద్య దంపతులు చెన్నమనేని వికాస్, దీప తెలిపారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ కార్పొరేట్ సంస్థ ద్వారా గ్రామాలకు అంబులెన్స్‌లు, మహిళలకు కుట్టు మిషన్లు, మ్యాచింగ్ సెంటర్లు, పేపర్ ప్లేట్ల తయారీ, గ్రామాల్లో హెల్త్‌క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మహిళలకు కిట్లు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ముప్పిడి



వాటర్‌ప్లాంట్ ప్రారంభిస్తున్న వైద్య దంపతులు

సునంద, రామతీర్థపు కృష్ణవేణి, రేగుల సంతోష్‌బాబు, అన్నారం ఉమారాణి, ఎంపీపీ బండ మల్లేశం, నాయకులు ముప్పిడి శ్రీనివాస్, మహిళా సంఘాల సభ్యులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

శుభకార్యానికి వెళ్లొస్తూ తిరిగిరాని లోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి
- రెండు కుటుంబాల్లో విషాదం



నాగరాజు(ఫైల్)

కోనరావుపేట(వేములవాడ): శుభకార్యానికి వెళ్లి తిరిగొస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందగా, ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. కోనరావుపేట మండలం నిమ్మపల్లికి చెందిన అన్నదమ్ములు అనుముల ఓదెలు(63), అనుముల లింగారెడ్డి(55), లింగారెడ్డి కొడుకు నాగరాజు(30) ముగ్గురు కలిసి ఆదివారం నిజామాబాద్ జిల్లా గాంధారికి వెళ్లారు. అక్కడ కార్యక్రమం పూర్తికాగానే ఇంటికి బైక్‌పై తిరుగు ప్రయాణమయ్యారు. కొలనూర్ శివారులో ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఓదెలు, నాగరాజు సిరిసిల్ల ఆస్పత్రిలో మృతిచెందారు. లింగారెడ్డి పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. ఇద్దరి మృతితో రెండు కుటుంబాల్లో విషాదం అలుముకుంది.

మృతదేహంతో పరుగులు

సిరిసిల్లక్రైం: కోనరావుపేట మండలం మర్తన్‌పేట శివారు మోర్గదర్శి పాఠశాల సమీపంలో రాత్రి జరిగిన ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. మృతదేహంతోపాటు మరొకరిని సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఇరువురి మృతిచెందినట్లు నిర్ధారించారు. పోస్టుమార్టం చేసేందుకు మృతదేహాన్ని గదిలోకి తీసుకెళ్లారు. ఇంకో మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు వైద్య సిబ్బంది వస్తున్న క్రమంలో మరొకరు మృతి చెందలేదని, కదలికలున్నాయని బాధిత కుటుంబీకుల్లో ఒకరు ఆరోపించారు. ఇక్కడి వైద్యులపై నమ్మకం లేదని, మరో ఆస్పత్రికి తీసుకెళ్తామని స్ట్రెచర్‌పై ఉన్న మృతదేహంతో బాధితుల కుటుంబీకులు అంబేడ్కర్ చౌరస్తామీదుగా పరుగులు తీశారు. ఆపేందుకు యత్నించే క్రమంలో ట్రాఫిక్ ఎస్సై రాజుపై ఒకరు చేయి చేసుకున్నారు. బతికున్న వారిని చనిపోయారని చెబుతున్నారని, తమకు అంబులెన్స్ ఇస్తే మరో ఆస్పత్రికి తీసుకెళ్తామని పోలీసులకు తెలపడంతో అంబులెన్స్‌లో మృతదేహాన్ని పరీక్ష నిమిత్తం కరీంనగర్‌కు తరలించారు.



కొలనూర్‌లో జరిగిన ప్రమాద దృశ్యం

గుండెపోటుతో గృహిణి మృతి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని జిల్లెల్ల గ్రామానికి చెందిన సాయిలి రేవతి (25) ఆదివారం గుండెపోటుతో మృతిచెందింది. గ్రామంలో అందరితో కలివిడిగా ఉండే రేవతి చిన్న వయస్సులోనే మృతిచెందంతో గ్రామంలో విషాదం నెలకొంది. మృతురాలికి భర్త సాయిలి రమేశ్, ఇద్దరు కుమారులు ఉన్నారు.



రేవతి (ఫైల్)

తాళం వేసిన ఇళ్లలో చోరీ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాజన్నపేటలో తాళం వేసిన ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో శనివారం అర్ధరాత్రి గ్రామానికి చెందిన దండం మైసయ్య, వజ్రవ్వ ఇళ్లలో దాదాపు రూ. 50వేల నగదుతో పాటు బంగారు అభరణాలను అపహరించారు. మరికొందరి ఇళ్ల తాళాలు పగులగొట్టి చోరీకి యత్నించారు. విషయం తెలుసుకున్న సీఐ మొగిలి, ఎస్ఐ శేఖర్ ఘటనా స్థలానికి చేరుకొని గ్రామస్తుల నుంచి వివరాలు సేకరించారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీంతో ఆధారాలు సేకరిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ఘనంగా పోచమ్మ బోనాలు





ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లో ఆదివారం యాదవ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ, మల్లన్న బోనాలు తీశారు. ఇంటికో బోనం చొప్పున మహిళలు ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. నైవేద్యం సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు. బైండ్లవాళ్ల గాండ్రింపులు, శివసత్తుల పూనకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మల్లికార్జున స్వామి పట్నాలు వేశారు. పాడి, పశుసంపద, పంటలను, ప్రజలను చల్లగా చూడాలని మల్లికార్జునస్వామిని వేడుకున్నారు. యాదవ సంఘం సభ్యులు ఎలుసాని మోహన్‌కుమార్, హనుమాండ్లు, రామదాసు, ప్రవీణ్‌కుమార్, రాజాం, లక్ష్మీరాజం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పూల్.. సమ్మర్‌ఫుల్

- వేసవి సెలవులతో ఈత కొలనుల వద్ద చిన్నారుల సందడి
- ఎండనుంచి ఉపశమనం పొందేందుకు రోజంతా ఎంజాయ్



స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొడుతున్న చిన్నారులు

వేములవాడ: రోజురోజుకూ ఎండలు మండుతున్నాయి. ఉష్ణోగ్రతలు 46 డిగ్రీలు నమోదవుతుండటంతో బయటకు రావాలంటే జనం జంకుతున్నారు. ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతుండటంతో ఎండవేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు చిన్నా పెద్దా అనే తేడా లేకుండా స్విమ్మింగ్ పూల్‌ల బాట పడుతున్నారు. పట్టణంలోని కోనాయపల్లి రోడ్డు భీమేశ్వర గార్డెన్‌లోని స్విమ్మింగ్ పూల్ వద్ద సందడి నెలకొంది. ఎండవేడిమి నుంచి రక్షణ కోసం స్విమ్మింగ్ పూల్‌లో చాలా సేపు గడుపుతున్నారు. చిన్నారులు సైతం ట్యూబ్‌లతో గంటల తరబడి నీళ్లలో జలకాలాడుతూ ఎంజాయ్ చేస్తున్నారు. నిర్వాహకులు స్విమ్మింగ్ పూల్ వద్ద ఫ్రెష్ వాటర్ పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. ముందుగా పైప్‌లైన్ వద్ద స్నానాలు చేసిన తర్వాతే స్విమ్మింగ్ పూల్‌లోకి అనుమతిస్తున్నట్లు నిర్వాహకుడు అన్వేశ్ తెలిపారు. గంటకు రూ.70, అరగంటకు రూ. 50 చొప్పున ఫీజు తీసుకుంటున్నట్లు తెలిపారు.

వేసవి సెలవులు కావడంతో..

విద్యా సంస్థలకు వేసవిసెలవులు కొనసాగుతుండటంతో చిన్నారులు, ఇంటర్, డిగ్రీ చదివే విద్యార్థులు ఈత నేర్చుకునేందుకు తల్లిదండ్రులతో స్విమ్మింగ్ పూల్ వద్దకు చేరుకుంటున్నారు. ట్యూబ్‌లు కొనుగోలు చేసి ఈత నేర్చుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. గంటల తరబడి ఈత కొలనులో ఉంటూ ఎంజాయ్ చేస్తున్నారు.

నీటిని చూస్తే భయం వేసేది



ఈత నేర్చుకోవాలనే తపనతో కోనాయపల్లి రోడ్డులోని స్విమ్మింగ్ పూల్ వద్దకు వచ్చా. ముందుగా వారంతా ఎలా ఈత కొడుతున్నారో చూశా. నీటిని చూస్తే చాలా భయం వేసింది. ట్యూబ్ సహాయంతో స్విమ్మింగ్ పూల్‌లో ఈత నేర్చుకున్నా.

– రాజేశ్, 5వ తరగతి, విద్యార్థి, అర్బన్‌కాలనీ, వేములవాడ

ప్రతి వేసవిలో వస్తా



ప్రతి వేసవి సెలవుల్లో స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొట్టేందుకు వస్తాను. చిన్నతనంలోనే ఈత నేర్చుకోవడం వల్ల నీళ్లంటే భయం పోతుంది. రోజూ ఇక్కడ సందడి వాతావరణం నెలకొంది.

– నివాస్, 6వ తరగతి, చెక్కపల్లి రోడ్డు, వేములవాడ

ఆనందంగా గడపొచ్చు



స్విమ్మింగ్ చేయడం ఆరోగ్యానికి మంచిది. వేసవిలో స్విమ్మింగ్ పూల్‌కు వచ్చామంటే చాలాసేపు ఆనందంగా గడపవచ్చు. యోగా తర్వాత స్విమ్మింగ్ చేయడం మంచిది.

– శేర్వాణి, ఇంటర్ సెకండియర్, భగవంతరావు నగర్, వేములవాడ

ధాన్యం తూకంలో మోసం

- వ్యాన్, తూకం బాట్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు
- వ్యాపారిపై కేసు నమోదు



వ్యాన్‌ను అడ్డుకున్న గోస్కులపల్లె రైతులు

చందుర్తి(వేములవాడ): ధాన్యం తూకంలో ఓ వ్యాపారి చేసిన మోసం చేసిన ఘటన మండలంలోని మూడపల్లి అమేట్ల్ గ్రామమైన గోస్కులపల్లెలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన పుల్కం సత్తయ్య అనే రైతు కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకురాగా లారీల కొరతతో జాప్యం జరుగుతుందని భావించాడు. నర్సింగాపూర్ గ్రామానికి చెందిన కొత్త శ్రీనివాస్‌రెడ్డి అనే ఫర్టిలైజర్ వ్యాపారికి క్వింటాల్‌కు రూ.1850కి విక్రయించేందుకు అంగీకరించాడు. ఆదివారం 176 బస్తాల ధాన్యాన్ని తూకం వేశారు. గన్నీ సంచుల్లో నిండా ధాన్యం నింపినా 42 కిలోలు రాకపోవడంతో అక్కడున్న వారికి అనుమానం వచ్చింది. వెంటనే ఎలక్ట్రానిక్ కాంటా తీసుకురాగా ఒక్కో బస్తా 44.500 కిలోలు, 45 కిలోలు వచ్చాయి. వెంటనే తూకం వేసిన కాంటా పరిశీలించి బాట్ల కింద వెల్డింగ్ చేసిన రేకులు కనిపించడంతో జరిగిన మోసంపై డయల్‌కు 100కు సమాచారం ఇచ్చారు. పోలీసులు రైతుకు జరిగిన మోసం గురించి అడిగి తెలుసుకున్నారు. ధాన్యం లోడుతో ఉన్న వ్యాన్ కాంటా, బాట్లను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

– పరిహారం చెల్లించేందుకు పైరవీలు

వ్యాపారి మోసం బయట పడడంతో బాధిత రైతుకు పరిహారం చెల్లించేందుకు అతని బంధువులు, ప్రజాప్రతినిధులతో పైరవీలు చేశాడు. ఎక్కువగా తూకం వేసిన ధాన్యానికి డబ్బులు చెల్లించడంతో పాటు మోసానికి పాల్పడినందుకు డబ్బులు చెల్లించేందుకు మండలంలోని మర్రిగడ్డలో ఒప్పందం చేసుకున్నట్లు తెలిసింది. దీనికి రైతు సత్తయ్య అంగీకరించినట్లు సమాచారం. రైతు వద్దకు వెళ్లిన మీడియాకు జరిగిన మోసం గురించి తెలిపేందుకు బుకాయించారు. వ్యాపారి శ్రీనివాస్ రెడ్డి యాసంగి ధాన్యాన్ని నమిలిగొండలో 20 లోడ్లకు పైగా, చందుర్తిలో సుమారు 15లోడ్లకు పైగా కొనుగోలు చేయడంతో వారంతా డబ్బులు డిమాండ్ చేస్తారనే గోస్కులపల్లె రైతుకు పరిహారం చెల్లించేందుకు ముందుకొచ్చినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. చివరకు పోలీసుల నుంచి వ్యాపారికి చుక్కెదురైంది. పరిహారం పైరవీ బెడిసి కొట్టడంతో వ్యాపారికి మిగతా రైతుల నుంచి ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతాయోనని భయపడుతున్నట్లు తెలిసింది.

– కేసు నమోదు

ధాన్యం తూకంలో రైతును మోసం చేసిన కొత్త శ్రీనివాస్ రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జిల్లెల్ల రమేశ్ తెలిపారు. గోస్కులపల్లెకు చెందిన పుల్కం సత్తయ్య అనే రైతు వద్ద ధాన్యం కొనుగోలు చేసేందుకు వెళ్లగా తూకంలో మోసం చేశాడన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



వట్టెంలలో పూర్వ విద్యార్థులు

వేములవాడ రూరల్: మండలంలోని వట్టెంలలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో 6 నుంచి పదో తరగతి వరకు చదువుకున్న 1997–2002కు చెందిన బ్యాచ్ విద్యార్థులు ఒక్కచోట కలుసుకున్నారు. ఆదివారం పాఠశాలలో కలుసుకుని అప్పటి ప్రధానోపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా మధుర స్మృతులను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో అప్పటి ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హన్మాజీపేటలో..



సమావేశమైన పూర్వ విద్యార్థులు

మండలంలోని హన్మాజీపేట ప్రభుత్వ పాఠశాలలోని 1990–91 సంవత్సరంలో చదివిన పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం హన్మాజీపేట పాఠశాలలో జరిగింది. ఈ సందర్భంగా అప్పటి గురువులకు పాదాభివందనం చేశారు. అనంతరం రోజంతా ఆనందంగా జరుపుకున్నారు.



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ముస్తాబాద్‌లో..

ముస్తాబాద్(సిరిసిల్ల): మూడు దశాబ్దాల అనంతరం వారంతా ఒకే వేదికపై కలుసుకున్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల 1991–92 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థుల పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి గురువులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు సుధాకర్‌రెడ్డి, పర్శరాములుగౌడ్; మల్లేశం, రాంరెడ్డి, రాములు, పూర్వ విద్యార్థులు ఉప సర్పంచ్ రవీందర్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, యాదగిరిరెడ్డి, బాబు, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

కొదురుపాకలో..



గురువులతో పూర్వ విద్యార్థులు

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని కొదురుపాక హైస్కూల్ 1997–98 ఎస్సెస్సీ పూర్వ విద్యార్థుల సమ్మేళనం వేములవాడ అర్బన్ మండలం నాంపల్లిలో జరిగింది. అప్పటి గురువులను సన్మానించారు. రోజంతా ఉత్సాహంగా గడిపారు.